

# నా కళ్ళతో నాన్న

## - లిపి మల్లాది



(ప్రారంభం)

ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల , వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

**రచయితగా** మీకు 1972లో పరిచయమైన మల్లాది వెంకటకృష్ణమూర్తిగారు నాకు తండ్రిగా 1991లో పరిచయమయ్యారు. రచనలతో ఎంతో మందిని ఆకట్టుకుని, మరెందరికో ప్రోత్సాహం కలిగించిన ఆయనే ఈ కథాంశానికి స్ఫూర్తి. ఇటీవలే వచ్చిన ‘ఫేమిలీ ఆల్బం‘ అనే సీరియల్‌ను చదివాక నాకు వచ్చిన ఆలోచనే ఈ కథాంశం.

రచయితగా ఆయన నవలల్లో అనేక పాత్రలకు ప్రాణాలు పోశారు. వాటిలో ఎయిర్ హోస్టెస్, కల్నల్, డిటెక్టివ్, హౌస్ వైఫ్, వ్యాపారి, డాక్టర్ వంటి రకరకాల ఉద్యోగాలు మన స్థితులు, ఆలోచనలు కనబడతాయి. నిజజీవితంలో ఆయన ఏ పాత్రకి దగ్గరగా ఉంటారనేది చాలా తక్కువ మందికి తెలుసు. ఫోటో పబ్లిష్ చెయ్యకపోవడంతో ఆయన చూడటానికి ఎలా ఉంటారనేది ఆయన నవలల్లో ఉన్న పాత్రలద్వారా ఊహించుకుంటారు.

''మీరు నేను అనుకున్న దానికన్నా చాలా బావున్నారని'' కొందరు,

''మీరు నేనుకున్నట్లు అస్సలు లేరండి'' అని మరికొందరు చెప్పడం నేను విన్నాను.

ఎలాంటి కామెంట్ అయినా నవ్వుతూ స్పందించడం ఆయన తరహా. ఆయన గంభీరంగా కనబడినందుకు ఒకరు సినిమాలో విలన్ వేషాన్ని వెయ్యమని కోరారు. ఒప్పుకుని నటించి వుంటే ఆ సినిమా ఫ్లాప్ అయ్యేది. ఎందుకంటే ఆయన పొడుగ్గా బలంగా కనపడినా క్రూరత్వం ఎరగని మనిషి. హీరోయిన్ విలన్‌ని చూసి నవ్వితే జనాలకి నచ్చదు కనుక ఆ సినిమా ఆడేదికాదు.

అయితే నిజానికి ఆయన మా నాయనమ్మలా ఉంటారు. ఆయన పోలికలు మా ముగ్గురి ముఖంలో తెలిసినా, మా రెండో అక్క ఊహాకే ఎక్కువ వచ్చాయి. వారు రాసిన నవలలు ఎక్కువగా చదవకపోయినా, ‘అందమైన జీవితం‘లో శాంతి పాత్ర మా అమ్మనుండి ఇన్స్పైర్ అయ్యి రాసినదే‘ ‘అమెరికాలో మరోసారి‘లో కావ్య, ‘హిమాలయంలో మహిమాలయం‘లో నేను. ఆమాటకి వస్తే, నెలనెలా

కౌముదిలో మా అమ్మ రాసే ‘సంసారంలో సరిగమలు‘ నిజజీవితంలో వ్యక్తులను చూసి రాసినవే. తను ఒప్పుకోకపోయినా ఆ కథల్లోని పాత్రలను నేను గుర్తుపట్టగలను.

ఇంతకీ ఆయన ఏ పుస్తకంలో ఉన్నారా అని ఆలోచిస్తున్నారా? ఆయనే మూలకర్త అవ్వడం చేత అన్ని పుస్తకాల్లోని ప్రతిపాత్రలో ఆయన జీవించారు, నాతో సహా.

నిర్మలమైన మనసు కలిగి, ఏ విషయాన్నీ ఒకేవైపునుండి ఆలోచించని ఆయనకి ముక్కుమీద కోపం. కానీ, ఎంత కోపం తెప్పించే పని చేసినా పిల్లలమీద ఆయన ఒక్కసారికూడా గట్టిగా మాట్లాడ్డం నేను విని ఎరగను. ఆయన రాసుకున్న పేపర్లు చింపినా, చదివే బుక్ పోగొట్టినా, ఇంటికి ఆలస్యంగా వచ్చినా, ఆయన కళ్ళల్లో కోపాన్ని నేను ఈనాటికీ చూడలేదు.

సహజంగా పిల్లలను మందలించడం తండ్రి బాధ్యత, బుజ్జగించడం తల్లిది. చిన్నతనంలో నేను మా రెండో అక్క ఊహ బాగా పోట్లాడుకునేవాళ్ళం(ఇప్పుడు కాస్త తగ్గింది). గొడవ తనే మొదలుపెట్టినా, నా పేరే చెప్పడంతో అప్పుడప్పుడూ మా అమ్మ నన్ను మందలించేది. వెనుకనుండి వెక్కిరిస్తున్న ఊహమీద కోపంతో చేతిలోని వస్తువుని విసిరేసి నాన్న దగ్గరకి వెళ్ళేదాన్ని. ఆయన రాస్తూ బిజీగా ఉన్నా, కత్తిపట్టుకున్న హంతకుడు పెట్రిష్యాని చంపుతాడా, లేక డిటెక్టివ్ కాపాడతాడా అనే సస్పెన్స్‌లో ఉన్న పుస్తకాన్ని చదువుతున్నా, ముందుగా నన్ను బుజ్జగించి, అవసరమైతే తన మోటార్ సైకిల్ మీద తీసుకువెళ్ళి ఐస్‌క్రీం కొనిచ్చిన తరువాత పెట్రీష్యా బ్రతుకుతుందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేవారు.

రచయిత కావడంతో చలసానిప్రసాదరావు, జంధ్యాల, దేవదాస్ కనకాల వంటి ప్రముఖులు తరచూ ఇంటికి వచ్చేవారు. నా మొసలికన్నీరు చూసి వారూ బుజ్జగిచ్చే ప్రయత్నం చేసేవారు. పక్కన ఎవ్వరున్నా పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వడంతో వారు ఎంత ప్రముఖులు అనే విషయం కాలేజీలో ఫ్రెండ్స్ చెపితే కానీ నాకు తెలీలేదు.

ప్రముఖులే కాదు బంధాలు, బాంధవ్యాలు కూడా తెలియని వయసది. ప్రతీరోజూ సాయంత్రం ఆరుబయట కుర్చీలో కూర్చుని మా నాన్న, పెదనాన్న మాట్లాడుకునేవారు. ఒక సాయంత్రం మా ఇంటి పైభాగంలో ఉండే పమ్మీ, నేను బాల్కనీ నుండి వారు చర్చించుకోవడం చూసాము.

"రోజూ ఏం మాట్లాడుకుంటారో తెల్సా?" అని పమ్మీ అడగగా,

"మా నాన్నా, పెదనాన్న మనలాగే బెస్ట్ ఫ్రెండ్స్ అందుకే రోజూ మాట్లాడుకుంటారు" అని బదులిచ్చాను.

"మీ నాన్నా, పెదనాన్న బ్రదర్స్" అని పమ్మీ చెప్పినా నేను నమ్మకపోవడంతో వాళ్ళ అమ్మని అడిగాము. ఆవిడ నవ్వుతూ పమ్మీ చెప్పిందే కరెక్ట్ అన్నారు. ఆవిడ మాటమీద నమ్మకం కలగక మా అమ్మని అడిగాము.

"పెదనాన్న అనేది పేరుకాదు, ఆయన మీ నాన్నగారి సొంత అన్నయ్య" అని విడమరచి చెప్పింది మా అమ్మ. ఔనా అని ఆశ్చర్యపోయానప్పుడు.

మా పెదనాన్న బేంక్ మేనేజర్‌గా పనిచేసేవారు. ఆయనకి ఇద్దరు అబ్బాయిలు. ఉద్యోగానికి పదిగంటలకు వెళ్ళేవారు. ప్రతిరోజూ ఉదయాన్నే ఆరింటికి నన్ను వాళ్ళ ఇంటికి తీసుకెళ్ళి రొట్టెను చిన్నముక్కలా చేసి అద్దుకోవడానికి జామ్‌ని ప్లేట్‌లో వేసి ఇచ్చేవారు. అది తిన్న తర్వాత "ప్లేట్‌ని సింక్‌లో పెట్టవే" అంటే పెట్టేదానినట. "ప్లేట్‌ని సింక్‌లో పడేయవే" అంటే పడేసేదాన్నట.

ఆ తరువాత "ఇంటికి దింపూ" అని పేచీ పెట్టేదాన్నట. ఒకరోజు ఊహ నన్ను ఫాన్ ఆన్ చెయ్యమని అడగడం విని మా నాన్న ఊహతో "ఎవరిపనులు వాళ్ళే చేసుకోవాలి" అని చెప్పారు.

మరుసటిరోజు మా పెద్దనాన్న నన్ను మంచినీళ్ళు ఇవ్వమని అడిగినప్పుడు "మా నాన్న ఎవరిపని వాళ్ళే చేసుకోవాలని చెప్పారు" అని అన్నానట. ఆడపిల్లలపై మక్కువ ఉండడం వల్ల నన్ను బాగా గారాబం చేసేవారు.

"కావ్య అమ్మపిల్ల, ఊహ నాన్న పిల్ల, నువ్వు పెదనాన్న పిల్ల" అని తరచూ అనేవారు. పెదనాన్న వాళ్ళు మా ఇంటికి అవతల ఉన్న ఇంట్లో ఉండేవారు. దాంతో మా అమ్మపై అలిగిన ప్రతీసారి వాళ్ళ ఇంటికి వెళ్ళేదాన్ని. నేను కోపంతో భోంచెయ్యలేదన్న సంగతి గ్రహించి, "తిండి మానితే నీ కడుపే కాల్తుంది. అలా కాకుండా ఫ్రిడ్జ్‌లో ఉన్న కాయగూరలన్నీ తినేస్తే మీ అమ్మ వంట చెయ్యడానికి ఏం మిగలవు. మీ అమ్మ కూరలు తరుగుతున్నప్పుడు పక్కనే కూర్చుని కోసిన ముక్కల్ని తినేసెయ్. అప్పుడు మీ అమ్మకి చాకిరీ పెరుగుతుంది. అలా తిక్క చెయ్యాలి కానీ తిండి మానకూడదు" అని నేర్పారు. ఆ అలవాటు ఇప్పటికీ పోలేదు.

నేను పదవతరగతిలో ఉన్నప్పుడు నేను, నా ఫ్రెండ్ మా అమ్మతో మాట్లాడ్డానికి కిచెన్‌లోకి వెళ్ళాం మా అమ్మకోస్తున్న వంకాయ ముక్కలు తినడం చూసి పచ్చినెత్తురు తాగుతున్న రాక్షసిని చూసినట్టు ఆ అమ్మాయి నన్ను చూసి బిత్తరపోయింది. ఒకసారి మా అమ్మ, నాన్నా బయటికి వెళ్ళినప్పుడు నాకు, ఊహకి ఆకలిగా ఉంది.

"వెజిటబుల్ సాలడ్ తింటావా?" అని అడిగాను.

పరధ్యానంలో ఉన్న ఊహ, "ఏదో ఒకటి చెయ్యి ఆకలేస్తుంది" అని బదులిచ్చింది.

నేను ఫ్రిడ్జిలో ఉన్న కాయగూరలను కడిగి, కట్‌చేసి, బీట్ రూట్ ముక్కలపైన బంగాళాదుంపముక్కలను పరిచి, వాటిపైన కేరట్, టమోటాలని అలంకరించి, కొత్తిమీర చల్లి ఫోర్క్ వేసి ఇచ్చాను.

"ఇది తినాలా?" అని షాక్ అయ్యి బ్లాంక్ ఫేస్‌తో ఊహ నన్ను అడగడం గుర్తొచ్చిన ప్రతీసారి నవ్వొస్తుంది. ఇలా పచ్చికూరలను తినే అలవాటు నాకు, మా నాన్నకు మాత్రమే ఉంది. కావ్య చాలావరకు ప్రయత్నిస్తుంది. ఒకరోజు హ్యూస్టన్‌లో హెచ్.ఈ.బి నుండి కాక్టస్ లీఫ్‌ను ఇంటికి తెచ్చి నేను మా నాన్న గ్రిల్ చేసుకుని తింటూ దాన్ని ఇంకా ఎన్ని రకాలుగా వండవచ్చని చర్చించుకుంటున్నాం. కేక్టస్ తినడమేంటి అని మా అమ్మ ఆశ్చర్యపోయింది. ఇంకోరోజు సీ వీడ్‌ని తినడం చూసి "పాచిని కూడా తింటున్నారా?" అని ప్రశ్నించింది. మరోసారి వీట్‌గ్రాస్‌ని తినడం చూసి, "ఆఖరికి గడ్డిని తిన్నారు ఇద్దరూ కలిసి" అని పోట్లాడింది.

2015 అక్టోబర్‌లో నేను ఫ్లోరిడాకి వెళ్ళినప్పుడు పై కథని నా స్నేహితులకు చెప్పి మాంసాహారినై ఉంటే బహుశా ప్రపంచంలో ఉన్న అన్ని జీవాలని రుచి చూసేదాన్ని కాబోలు, మనిషితో సహా అని నవ్వాను. ఎస్కాట్‌లైన్‌లో మా వెనుక నిలబడిన ఇద్దరు ఆ మాటకి భయపడి వెళ్ళిపోయారు.

1985లో కావ్య పుట్టినప్పుడు మా నాన్న ఆఫీస్ నుండి సెలవు తీసుకుని కొద్దినెలలు కావ్యతో గడిపారు. లీవ్ పూర్తై తిరిగి ఆఫీస్‌కు వెళ్ళాక కావ్యని బాగా మిస్ అయ్యి 'పద్మ పనిలో ఉన్నప్పుడు కావ్యకి ఏదైనా అవసరం వస్తే ఎలా?' అని ఆలోచించి ఇంకొన్ని రోజులు సెలవు కావాలని అడిగారట. అది తిరస్కరించినందుకు మా నాన్న ఉద్యోగానికి రాజీనామా చేసి ఫుల్‌టైం రైటర్ అండ్ ఫుల్ టైం ఫాదర్ అయ్యారు.

1997లో మా అమ్మ సివిల్స్ ఎక్జాం పాస్ అయ్యింది. ఇంటర్వ్యూకి రెండురోజుల ముందు దీర్ఘచర్చ తరువాత తను ఉద్యోగం చేయనని తీర్మానించింది. ముగ్గురు పిల్లలను తీర్చిదిద్దడమే తన ఉద్యోగం అని నిర్ణయించుకుంది. ఈ రోజుకీ ఎన్నిసార్లు అడిగినా, ఎన్నిరకాలుగా అడిగినా అదే సరైన నిర్ణయమని, కాలాన్ని వెనక్కి తిప్పినా ఇదే నిర్ణయం తీసుకుంటానని బల్లగుద్ది చెప్పింది. ఐ.ఎఫ్.ఎస్, ఐ.ఏ.ఎస్ కాకపోయినా తను ఎంచుకున్న ఉద్యోగాన్ని సరిగ్గా నిర్వహించేది. ఈ విషయంలో నాకు నా తల్లిదండ్రుల పోలిక రాలేదు.

ఎంచుకున్న ఉద్యోగాన్ని నిర్వహించేందుకు కావ్య ఘన, కాంగో, పేరిస్, నార్వే వంటి దేశాలకు వెళ్ళింది. పాశ్చాత్య దేశమైన అమెరికాలో ఎనిమిదేళ్ళు నివశించి ఘనా వంటి వెనకబడిన ప్రదేశానికి వెళ్ళినప్పుడు ఆ వాతావరణానికి అలవాటు పడేందుకు చాలా ఇబ్బంది పడింది. ఇది గ్రహించిన మా నాన్న "ఘనా చూడాలని ఉందమ్మా" అని పనులను ఆపి కావ్య అక్కడ అలవాటు పడేంతవరకు తోడుగా ఉన్నారు. కావ్య డిగ్రీ పూర్తిచేసుకుని ఫ్లోరిడా నుండి హ్యూస్టన్‌కు మారేందుకు సహాయపడ్డారు. అలాగే ఊహకి ఇండియానాలో

ఉద్యోగం వచ్చినప్పుడు కొన్ని నెలలు ఊహతో ఉన్నారు. ఇలా పిల్లలకి అవసరమని గ్రిహిస్తే పనులు మాని, దేశాలు మారి నెలల తరబడి సమయాన్ని కేటాయించే మనస్తత్వం.

మా రెండో అక్క ఊహ డ్యూ డేట్‌కి మూడువారాల ముందే వచ్చి సాయం చేద్దామనుకున్నారు. కానీ ఆ పాప అంతవరకూ ఆగలేక ఫిబ్రవరి 17న పుట్టింది. ఆ పాపకి ఆరునెలలు వచ్చేంతవరకు ఆలనాపాలనా అమ్మమ్మ, తాతయ్యలే చూసుకున్నారు. మా ఇంట్లో నా తరువాత పుట్టిన మొదటి బిడ్డ అవ్వడంతో మా ముగ్గురికీ చిన్న పిల్లలతో ఎక్కువ అనుభవం లేదు. 'జాగ్రత్తమ్మా.. మెల్లిగా.. చూసుకుని' అని మా ముగ్గురిలో ఎవరైనా అంటే "మీ ముగ్గురినీ పెంచింది నేనే" అని మా అమ్మ కోపంగా అన్నప్పుడు మా నాన్న ముఖంలో నవ్వుని నేను ఎన్నటికీ మర్చిపోలేను.

మా నాన్న చిన్న పిల్లలని ఆడించడం, కథలు చెప్పడం, జోలపాటలు పాడటం నా జీవితంలో నేను మొట్టమొదటిసారిగా చూసాను. "నన్నూ ఇలానే ఆడించేవారా?"అని ఒక రోజు అడిగాను.

"ఔను మీ ముగ్గురినీ ఇలానే ఆడించాను. నీకు గుర్తులేదంతే. నీ తరువాత ఎత్తుకున్న మొదటి పిల్ల ఇదే" అని చెప్పగా ఎందుకో నా కళ్లల్లో నీరు తిరిగాయి.

నాకు పిల్లలు పుట్టేసరికి బహుశా వీళ్ళకి ఆడించి లాలించే శక్తి ఉండకపోవచ్చు. కనుక నేను వాళ్ళు పాటలు పాడినా, గోరుముద్దలు తినిపించినా, ఎత్తుకుని నడిచినా, ప్రతీదీ రికార్డ్ చేసి దాచిపెడుతున్నాను. ఏదో ఒక రోజు నా పిల్లలకు అవి చూపించి "ఓపిక ఉంటే మిమ్మల్ని కూడా అలానే చూసుకునేవారు" అని తెలియపరచడానికి. అమ్మమ్మ నాయనమ్మలను ఎరిగినా, తాతయ్య లేని లోటు మా నాన్న తాతయ్య అయినప్పుడు తెలుసుకున్నాను.

కుటుంబ సభ్యుల మధ్య దూరం ఉండకూడదనేది మేమైదుగురం నమ్ముతాము (మా బావతో కలిపి ఆరు). అలా అని ప్రతీరోజు మాట్లాడవలసిన అవసరం లేదు. మా నాన్న స్వతహా తక్కువ మాట్లాడే మనిషి. సంభాషణ లేకపోవడం మా మధ్య దూరాన్ని ఎన్నడూ పెంచలేదు. ఆ మాటకి వస్తే నేను అమెరికాకి వచ్చాకే మా నాన్నకి ఇంకా దగ్గరయ్యాను. ఏ పని చేసినా మా అమ్మకి చూపించడం కావ్య నాకు నేర్పింది. "చాలా బావుంది, నాన్నకు చూపించు" అన్ని అమ్మ అనేది. ఎంత చిక్కిరి బిక్కిరి గీతలు గీసినా, అర్థంలేని కథలు రాసినా, "ఫస్ట్‌క్లాస్‌గా ఉంది" అని మా నాన్న అనగా "ఎప్పుడూ ఫస్ట్‌క్లాస్ అనే అంటావు. సెకెండ్ క్లాస్, థర్డ్ క్లాస్ అని ఎందుకు అనవు? " అని బాగా చిన్నప్పుడు ప్రశ్నించాను.

"ఎందుకంటే నువ్వెప్పుడూ ఫస్ట్‌క్లాస్ పనులే చేస్తావు కాబట్టి" అని బదులిచ్చారు. దాని అర్థం నాకు కొన్ని సంవత్సరాల తర్వాత తెలిసింది (అప్పుడు అంత చిన్నపిల్లని)

నేను ఊహ మీద కోపంతో నా మొదటి కవితని రాసినప్పుడు నా వయసు సుమారు తొమ్మిదేళ్ళు. 'అక్కంటే కుక్క.. విరిగిపోయిన పెంకు ముక్క.. చెదలు పట్టిన పేపరు ముక్క.... విసిరేసిన అరటిపండు తొక్క.. పారేసిన మామిడిటెంక..' అంటూ దాదాపు ఇరవై వాక్యాలని రాసాను. అది చదివి ఊహకి బాగా కోపం వచ్చింది.

"అక్కని అలా అనకూడదు తప్పు" అని మా అమ్మ మందలించినా నవ్వుతూ "చాలా బావుంది" అని మా నాన్న ఇచ్చిన ప్రోత్సాహం వల్లే ఈ రోజు మీరు ఇది చదువుతున్నారు. ఏది రాసినా చూపించినా, "చాలాబావుంది. ఇలానే రాస్తూండు" అని ముందుకు నెట్టి నాపై నాకు నమ్మకాన్ని కలిగించారు. ఎన్ని ఇన్ స్టాల్‌మెంట్స్ పెండింగ్ ఉన్నా, ఎన్ని సీరియల్స్ రాయాల్సి ఉన్నా, "నానా, ఇది చదువుతావా?" అని చేతిలో పదిపేజీలు పెట్టినా సరే, ముందుగా నా పిచ్చిరాతలో ఉన్న ఆ కాగితాలను ఓపికగా చదివిన తరువాతే తన పని చేసుకునేవారు. పిల్లలకి సమయాన్ని కేటాయిస్తూ, రచయితగా వందల నవలలను రాయడం నాన్నకే సాధ్యం.

మా నాన్న చిన్నతనంలో మా నాయనమ్మ ఇటువంటి ప్రోత్సాహాన్ని ఇచ్చేదట. మా నాన్నకి మా నాయనమ్మ ముఖమేకాదు, గుణంకూడా వచ్చింది. నా చిన్నప్పుడు మా నాన్న నాకు ఇచ్చిన 'హౌ టు బికం ఏ డిటెక్టివ్' అనే పుస్తకాన్ని చదివి నేను రోజుకొక మారువేషాన్ని ధరించేదాన్ని. మా నాన్నగారి తాటాకుల టోపీ, షర్ట్ ధరించి, పెన్ని సిగరెట్‌లా నోట్లో పెట్టుకునో, వంటికి దిండును కట్టుకుని మా అక్కయ్యల దుస్తులువేసుకుని, సర్దార్జీలా టర్బన్ కట్టుకుని, ముఖానికి గడ్డం, మీసం పూసుకునో గొంతుమార్చి మాట్లాడితే నిజంగానే నేనెవరో తెలీనట్టు మా నాన్న భయపడడం చాలా నమ్మశక్యంగా ఉండేది. (బహుశా నటన ఎంచుకుని ఉంటే బెస్ట్ ఏక్టర్ అయ్యేవారేమో). మా నాయనమ్మ నా వేషధారణ చూసి పగలబడి నవ్వేది. నేను గొంతు మార్చి మాట్లాడే ప్రయత్నం ఆవిడని ఇంకా నవ్వించేది. ఏంటీ అవతారం అని అందరి తల్లుల్లాగే మా అమ్మ కూడా కసురుకునేది.

చిన్నప్పటి నుండి డిటెక్టివ్ బుక్స్ ఎక్కువగా చదవడం వల్ల అలాంటి ఆటలే ఆడేదాన్ని. మామూలు దొంగ, పోలీస్ కాకుండా మర్డర్ మిస్టరీలాంటి ఆటలు ఆడేప్పుడు మా నాన్న నా చేతికి బొమ్మ తుపాకీ, తలపైన కౌబాయ్ హేట్‌ని పెట్టేవాళ్ళు. అలాగే బుక్స్‌లో చదివిన కోడ్‌లాంగ్వేజెస్‌ని నిజజీవితంలో వాడేదాన్ని. ఎవరికీ అర్థంకాకూడదని. నా డైరీని కోడ్ లాంగ్వేజ్‌లో రాసేదాన్ని. నేను కనిపెట్టిన కొన్ని కోడ్‌లాంగ్వేజెస్‌ని నా స్నేహితులకు నేర్పాను. అప్పట్లో ఫేస్‌బుక్‌లో మా సంభాషణలు అదే భాషలో ఉండేవి. నేను కనిపెట్టిన భాష అంత బావుందా? లేక నా స్నేహితులు నేను కనిపెట్టానని వాడేవాళ్ళా? అనే ప్రశ్నకి బదులులేదు.

(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)

Click here to share your comments on this story